## ఆ సిబ్బంది మాకొద్దు

### దోమకొండ కేజీబీవీ విద్యార్థుల ఆందోళన




కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కామారెడ్డి, నవంబర్ 22: కొత్తగా వచ్చిన సిబ్బందిని వెనక్కి పంపించాలంటూ దోమకొండ మండలంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులు శుక్రవారం ఆందోళనకు దిగారు. బీబీపేట కేజీబీవీ నుంచి స్పెషల్ ఆఫీసర్, మరో ముగ్గురు సిబ్బందిని దోమకొండకు కేటాయించారు. అయితే, వాళ్లను చేర్చుకోవద్దని, వెనక్కి పంపించాలంటూ విద్యార్థినులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాఠశాల ఎదుట బైఠాయించి సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్తగా వచ్చిన వాళ్లను పంపించే వరకూ ఆహారం తీసుకోబోమని స్పష్టంచేశారు. ఎంఈవో విజయ్‌కుమార్ వచ్చి సర్దిచెప్పినా వారు వినలేదు. డీఈవోతోపాటు ఇతర జిల్లా అధికారులతో మాట్లాడి బీబీపేట నుంచి వచ్చిన ఎస్‌వో, ముగ్గురు సిబ్బందిని వెనక్కి పంపిస్తామని ఎంఈవో హామీ ఇచ్చినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదు. డిప్యుటేషన్‌పై వచ్చిన సిబ్బందిని వెంటనే పంపించాలని డిమాండ్ చేశారు.

## వడ్డేపల్లికి షోకాజ్ నోటీసు


### వారం లోపు వివరణ ఇవ్వాలని ఆదేశం


TELANGANA PRADESH CONGRESS COMMITTEE

Dr.G.CHINNA REDDY

SHOW CAUSE NOTICE – 21-11-2024

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 22 : ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి పీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు భారీగా ఫిర్యాదులు రావడంతో నోటీసు ఇచ్చిన డీఏసీ చైర్మన్ చిన్నారెడ్డి.. వారంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్తల నుంచి అనేక ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలుకు సంబంధించి ప్రతికూల సమాచారాన్ని ప్రజల్లో వ్యాప్తి చేస్తుండడం, పార్టీ సీనియర్ నేతలను సంప్రదించకుండా పార్టీ కార్యక్రమాలను పదే పదే ప్రశ్నిస్తున్నందున నోటీసు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా పార్టీలో చీలికలు సృష్టించడం ద్వారా కేడర్‌ను విభజిస్తున్నాడని, ప్రొటోకాల్‌ను విస్మరిస్తూ పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా, పొరుగున ఉన్న మహారాష్ట్రలో కూడా పార్టీ కేడర్‌లో తప్పుడు సంకేతాలు పంపుతున్నందున షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. వారం లోపు వివరణ ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని పేర్కొన్నారు.




### వాగుల్లో ఇసుక నాగులు..

భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో అక్రమ ఇసుక రవాణాకు అడ్డే లేదు. భీమ్‌గల్ మండలంలో కప్పల వాగును ఆనుకుని గోనుగొప్పుల, బెజ్జోరా, సికింద్రాపూర్, బడాభీమ్‌గల్, భీమ్‌గల్ గ్రామాలు, వేల్పూర్ మండలంలో పెద్దవాగును ఆనుకుని రామన్నపేట్, మోతే, వెంకటాపూర్, కుకునూర్, మోర్తాడ్‌లో సుంకెట్, మోర్తాడ్, పాలెం, దొన్కల్, ధర్మోరా, శెట్‌పల్లి, ఏర్గట్ల మండలంలో తొర్తి, బట్టాపూర్ గ్రామాలు ఉన్నాయి. ఇక, ఏర్గట్ల మండలంలో గోదావరి తీరంలో తడ్‌పాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాలు ఉన్నాయి. ఏర్గట్ల మండల కేంద్రానికి వాగు ఆనుకుని ఉంది. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు గ్రామ కమిటీలతో మాట్లాడుకుని అక్రమ ఇసుక తవ్వకాలకు తెర లేపారు.

మోర్తాడ్, నవంబర్ 22 : అది వాగా, కాలువా, చెరువా అనేది సంబంధం లేదు.. ఇసుక కనిపిస్తే చాలు తోడేసుడే అన్నట్లు బాల్కొండ నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్నది. రాత్రీ పగలూ తేడా లేదు. అనుమతులూ అక్కర్లేదు. ఇసుక తవ్వడం, అమ్మడం, ఎవరైనా అడిగితే బెదిరింపులకు పాల్పడడం.. నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న తంతు. మరీ ఇంతగా ఇసుకపై పడ్డారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లతోనే వారు కండ్లు మూసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

## సర్కారు ఆదాయానికి
# టెండర్

- ఇసుక తవ్వుకునేందుకు గ్రామాల్లో టెండర్లు
- ఓ చోట రోజుకు రూ.1.50 లక్షలు చెల్లించేలా ఒప్పందం?
- మిగిలిన చోట్ల రూ.లక్షల్లోనే వేలం పలికిన వైనం
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అక్రమాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు

**సహజ సంపద** దోపిడీకి గురవుతున్నది. సర్కారు ఆదాయానికి గండి పడుతున్నది. ప్రధానంగా బాల్కొండ నియోజకవర్గంలో అక్రమ ఇసుక దందాకు అడ్డే లేకుండా పోయింది. కొన్ని గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాల కోసం ఏకంగా టెండర్లు నిర్వహిస్తుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొందరు అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. వాగు, కాలువ, చెరువు.. ఎక్కడ ఇసుక కనబడితే అక్కడ రాబందుల్లా వాలిపోయి తోడేస్తున్నారు. పొద్దున, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా తిరుగుతున్న ఇసుక వాహనాలు దోపిడీతీరును కళ్లకు కడుతున్నాయి. అనుమతి లేకుండా టన్నుల కొద్దీ ఇసుక అధికారుల కండ్ల ముందు నుంచే తరలిపోతున్నా పట్టనట్టు వ్యవహరిస్తుండడం విషాదం.

అర్ధరాత్రి వేళ ఇసుకతో భీమ్‌గల్ మీదుగా వెళ్తున్న లారీ



### వేలం వేసి మరీ..

- ఏర్గట్ల మండలంలో ఎక్కడా ఇసుక తరలింపునకు అనుమతి లేదు. కానీ, అన్ని గ్రామాల్లో అక్రమంగా తరలించుకుపోతున్నారు. ప్రతి గ్రామంలో వీడీసీలతో మాట్లాడుకుని టెండర్లు పాడి అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఇటీవలే బట్టాపూర్, తాళ్లరాంపూర్, తడ్‌పాకల్ గ్రామ కమిటీలు టెండర్లు నిర్వహించాయి. బట్టాపూర్‌లో సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఇసుకను తరలించుకునేందుకు టెండర్ ఖరారైంది. ఇసుక నడుపుకునే రోజు గ్రామ కమిటీకి రూ.1.50 లక్షలు చెల్లించాలని ఒప్పందం కుదిరినట్లు తెలిసింది.
- తాళ్లరాంపూర్‌లోని వాగు నుంచి ఇసుక తవ్వుకోవడానికి ఏడాదికి రూ.4.50 లక్షలు, తడ్‌పాకల్‌లో రూ.5 లక్షలకు పైగా, గుమ్మిర్యాల్‌లో రూ.2లక్షలకు పైగా టెండర్లు ఖరారైనట్లు సమాచారం. అదే కోవలో ఏర్గట్ల, దోంచంద, తొర్తి గ్రామాలు నడుస్తున్నాయి. బట్టాపూర్ మినహాయిస్తే అన్ని గ్రామాల్లో ఏడాది వ్యవధి కోసం టెండర్లు నిర్వహించగా, బట్టాపూర్‌లో మాత్రం రోజుకు రూ.1.50 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదరడం మండలంలో చర్చనీయాంశమైంది.

### మోర్తాడ్‌లో తోడేస్తున్నారు..

మోర్తాడ్ మండలంలోనూ ఇసుక కనిపిస్తే చాలు తోడేస్తున్నారు. ధర్మోరా, పాలెం గ్రామాల్లో పొక్లెయిన్లతో ఇసుకను తోడేశారు. అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈగ్రామాల్లో ప్రస్తుతం అక్రమ రవాణా ఆగింది. వడ్యాట్‌లో ఉన్న ఇసుకనంతా తోడేశారు. ఇక మోర్తాడ్ మొండి వాగుపై కొందరి కన్నుపడింది. పొక్లెయిన్లు పెట్టి అక్రమంగా తరలిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపం నుంచే ఇసుకను తోడేస్తున్నా అడిగే వారుండరు. మండలంలో ఇసుకను ఎక్కడికెళ్లి తీసుకెళ్లినా గ్రామ కమిటీలకు రూ.1800–రూ.2 వేలు చెల్లించాల్సిందే. ఇక, సుంకెట్‌లో ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న ఇసుక పాయింట్‌లోనూ అనేక అక్రమాలు జరుగుతున్నాయి. సమయం ముగిసిన తర్వాత కూడా ఇసుక తవ్వడం సాధారణమై పోయింది. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ట్రాక్టర్లను నడుపుతున్నారు. ఇసుక తరలించే వాహనాలకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండట్లేదు. ఇటీవల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని ఫైన్ వేశారంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

#### అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు..

అక్రమంగా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. లారీల్లో తరలించినా, ఎడ్లబండ్లపై తరలించినా చర్యలు తప్పవు. ఎక్కడైనా ఇసుక డంపులు వేస్తే సీజ్ చేస్తాం. మైనింగ్ అధికారులకు అప్పజెప్పి అధిక జరిమానా విధించేలా చూస్తాం.

**- షబ్బీర్, తహసీల్దార్, భీమ్‌గల్**

### భీమ్‌గల్‌లో జోరుగా..

భీమ్‌గల్ మండలంలోనూ అక్రమ దందాకు అడ్డే లేదు. పొక్లెయిన్లు పెట్టి తోడేయ్యడం ఒక ఎత్తయితే, ఎడ్లబండ్లపై తీసుకెళ్లి డంప్ చేసి అమ్ముకోవడం మరో ఎత్తు. బడాభీమ్‌గల్, భీమ్‌గల్ గ్రామాల్లో ఇసుక రవాణాకు ప్రభుత్వ అనుమతి ఉండగా, బెజ్జోరాలో మాత్రం అనుమతి లేదు. కానీ, ఈ గ్రామంలో అక్రమంగా రెండు ఇసుక పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో పాయింట్ వద్ద వంద రోజులు తవ్వుకునేందుకు రూ.7.50 లక్షల చొప్పున ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. బెజ్జోరా నుంచి పొక్లెయిన్లతో ఇసుకను తోడేస్తున్నా అధికారులు మాత్రం కిమ్మనడం లేదు. అనుమతి ఉన్న భీమ్‌గల్, బడాభీమ్‌గల్ ఇసుక పాయింట్ల నుంచి ఒకే వే బిల్లుపై రెండు మూడు సార్లు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. భీమ్‌గల్‌లో అయితే ఎడ్లబండ్లపై ఇసుకను తరలించి ఇతరులకు విక్రయించుకుంటారు. వీరికి వేబిల్లులు కూడా అవసరం లేదు. ఇలా అమ్ముకున్న ఇసుకను రాత్రుల్లో లారీల్లో తరలించి ఒక్కో లారీ రూ.45 వేల నుంచి రూ.60 వేల వరకు పట్టణాల్లో విక్రయించుకుంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది.



భీమ్‌గల్‌లో ఇసుకను తీసుకువచ్చేందుకు ఎడ్లబండ్లలో తరలివెళ్తున్న వ్యక్తులు

## శ్మశానానికి దారేది?



ఆత్మకూర్‌లో దారి లేకపోవడంతో పొదలు, గుంతల నుంచి పాడెను మోసుకువెళ్తున్న గ్రామస్తులు

- ఎవరైనా చనిపోతే గ్రామస్తులకు నరకమే
- కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం

నాగిరెడ్డిపేట, నవంబర్ 22 : ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులకు, స్థానికులకు సంకట స్థితి నెలకొంటుంది. శ్మశానానికి వెళ్లే దారి లేక శవ దహనానికి అనేక తిప్పలు పడాల్సి వస్తుంది. మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మెజారిటీ కులాలకు ఒకే చోట శ్మశాన వాటిక ఉంది. తాతల కాలం నుంచి ఇక్కడే అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్నారు. అయితే, కాలక్రమేణా బీడు భూములు పంట పొలాలుగా మారడంతో వైకుంఠధామానికి వెళ్లే దారి కనుమరుగైంది. ఏపుగా పెరిగిన చెట్లు, పొదల మధ్య నుంచి శవాన్ని మోసుకువెళ్లడం తీవ్ర ఇబ్బందిగా మారింది. శ్మశానానికి దారి చూపాలని గ్రామస్తులు కింది నుంచి జిల్లా స్థాయి అధికారుల దాకా అందరికీ మొర పెట్టుకున్నారు. కానీ ఫలితం లేకపోయింది. శుక్రవారం గ్రామానికి చెందిన పలంచ కిష్టయ్య మృతి చెందగా.. పాడె మోసేవారు, కుటుంబ సభ్యులు పొదల నుంచి నడవలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దారి చూపించాలని కలెక్టర్‌ను వేడుకున్నా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఈ సందర్భంగా వాపోయారు. అధికారులు స్పందించి ఈ నరక యాతన నుంచి కాపాడాలని కోరుతున్నారు.

## జోరుగా గంజాయి దందా!

బీబీపేట్ (దోమకొండ), నవంబర్ 22 : దోమకొండ మండలంలో గంజాయి దందా జోరుగా సాగుతున్నది. దోమకొండ మండలకేంద్రంతోపాటు అంచనూర్, ముత్యంపేట తదితర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తుండడంతో యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. దోమకొండ గ్రామ శివారులోని( గుండ్ల చెరువు) మినీ స్టేడియం సమీపంలో, పలుగడ్డ బహిరంగ ప్రదేశం, దోమకొండ–అంబారీపేటకు వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం. మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆ మత్తులో తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నాయి. దోమకొండ, అంచనూర్, ముత్యంపేట తదితర గ్రామాల శివారులో పార్టీల పేరుతో గంజాయి తాగుతున్నట్లు సమాచారం. ఇటీవల రెండు ఘటనల్లో యువకులు గంజాయితో పట్టుబడ్డా.. పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

#### గంజాయిని విక్రయిస్తే చర్యలు

గంజాయిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేకోవద్దన్నారు. గంజాయిపై గ్రామాల్లో యువతకు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం.

**- సంపత్‌కుమార్, సీఐ, భిక్కనూర్**

## తోబుట్టువే తోడేలుగా మారి..

- బాలికపై సోదరుడి అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు.. రిమాండ్‌కు తరలింపు



వినాయక్‌నగర్, నవంబర్ 22 : ఆడపిల్లకు రక్షణ లేకుండా పోయింది. బయటే కాదు, ఇంట్లోనూ భద్రత కరువైంది. వావీ వరుసలు మరిచి తోబుట్టువే తోడేలుగా మారి అమాయక బాలికను వంచించిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. అఘాయిత్యానికి గురైన బాలికకు గర్భస్రావం కావడంతో అసలు విషయం బయటపడింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ విషాద ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలో నివాసముండే ఓ బాలిక కడుపు నొప్పితో బాధపడుతున్నది. కుటుంబ సభ్యులు ఆమెను దవాఖానకు తీసుకెళ్లగా, వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బాలికకు గర్భస్రావమైందని గుర్తించారు. బాలిక నెల రోజుల గర్భం దాల్చిందని, అబార్షన్ కావడంతో రక్తస్రావమై కడుపు నొప్పి వచ్చిందని వెల్లడించారు. గర్భం దాల్చడానికి కారణమెవరని బాలికను ప్రశ్నించగా.. ఊహించని సమాధానం రావడంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. తన తోడబుట్టిన వాడే ఈ దారుణానికి పాల్పడ్డాడని చెప్పడంతో కన్నవారు కన్నీరుమున్నీరయ్యారు. ఏం చెప్పాలి, ఎవరితో చెప్పుకోవాలన్న మనోవేదనతో వారు కుమిలిపోయారు. అఘాయిత్యానికి పాల్పడిన వాడు కొడుకైన సరే.. తగిన బుద్ధి చెప్పాలని బాధితురాలి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో యువకుడిపై పోక్సో నమోదు చేసిన పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష దీపార్చన



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రామారెడ్డి, నవంబర్ 22 : ఇసన్నపల్లి – రామారెడ్డి గ్రామాల్లో వెలసిన కాలభైరవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం కార్తీక లక్ష దీపార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణంలో ఈవో ప్రభు రామచంద్రం దంపతులు అఖండ దీపాన్ని వెలింగించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి, పూజలు చేశారు. లక్ష దీపార్చన వ్యయ నిర్వాహకులుగా గంజి పద్మ– సతీశ్‌గుప్తా వ్యవహరించారు.